క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ గాంధీ బొమ్మ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, కోళ్లఫారం రోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, ఐటీసీ పెట్రోల్ బంక్ రోడ్, చర్చి రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

తైక్వాండోలో సిద్ధార్థ విద్యార్థినుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల జరిగిన తైక్వాండో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ చూపి ఏడు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న సీహెచ్ ఉష, డి.మేఘన, ఎ.రిషితారెడ్డి, ఎస్.భవిష్య యోచిత, పి.సిరి, పి.బిందు గంగా భాగ్యశ్రీ, ఎం.సిరివల్లి పోటీల్లో సత్తా చాటినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా తైక్వాండోలో ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు అభినందించారు.

స్వచ్ఛతాహి సేవపై అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తైన సందర్భంగా స్వచ్ఛభారత్ దివస్‌ను పురస్కరించుకొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌సుధీర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వద్దు అంటూ నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ర్యాలీ కళాశాల నుంచి ప్రారంభమై పంజా సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి కళాశాలకు చేరుకుంది. కార్యక్రమంలో కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, పీవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపులో నష్టపోయిన విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ




భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో చదువుకుంటూ ఇటీవల సంభవించిన వరదలో ముంపునకు గురై నష్టపోయిన విద్యార్థులకు ఏబీసీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం మంగళవారం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, న్యాయవాది ఆవుల వెంకటరావు మాట్లాడుతూ బుడమేరు వరద ముంపులో వేలాది మంది ఇళ్లు మునిగి పోయి తీవ్రంగా నష్టపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాల విద్యార్థులకు అనేక సందర్భాల్లో వివిధ రూపాల్లో సాయం అందజేశామని, తిరిగి ఈరోజు ఇలా సహాయం అందించాల్సిన పరిస్థితి వస్తుందనుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో కణతల బాబు, విజయ్, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వృద్ధులను ప్రతి ఒక్కరూ ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో కాకుండా వారితో పాటే ఉంచుకుని, వారి పట్ల ప్రేమ ఆప్యాయతలు చూపాలని ఆమె సూచించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరప్పాడులోని వృద్ధాశ్రమాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య వివరాలు కేర్‌టేకర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. తమకంటూ ఎవరూ లేని వారు మాత్రమే వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. హెల్త్ క్లినిక్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

దసరాకు సిద్ధం






దసరా ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి సిద్ధమైంది. ఉత్సవ స్వాగత ద్వారాలను ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దేవస్థానంలో పలుచోట్ల రంగులతో ముస్తాబు చేశారు. క్యూలైన వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి తగ్గట్లు ప్రసాదాల కౌంటర్లను అమర్చారు. భక్తుల కోసం పలుచోట్ల చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. భక్తజనం అవస్థ పడకుండా అవసరమైన వసతులను ఆలయ అధికారులు అందుబాటులోకి తెస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







నూతన యాగశాలలో ప్రత్యేక చండీహోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్మించిన యాగశాలలో చండీహోమం నిర్వహించడానికి దేవస్థాన వైదిక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద రూ. 5 కోట్ల అంచనాలతో నూతన యాగశాలను నిర్మించారు. దీన్ని ఏప్రిల్‌లో ప్రారంభించినా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలుగా యాగశాలకు తుది మెరుగులు దిద్దడంతో పాటు ఆరు అడుగుల మేర విస్తరణ చేపట్టారు. దసరా ఉత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక చండీహోమం నూతన యాగశాలలో నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. బుధవారం సాయంత్రానికి పనులు పూర్తవుతాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.



ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాల


అందరికీ స్ఫూర్తి.. గాంధీహిల్

నేడు గాంధీ జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయుల దాస్యానికి విముక్తి కల్పించిన మహనీయుడు మహాత్మాగాంధీ. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం మార్గదర్శకం. అటువంటి త్యాగధనుని జీవితాన్ని నేటి తరానికి చేరువ చేసే స్ఫూర్తి ప్రదాయిని గాంధీహిల్. మహాత్మాగాంధీ స్మారకార్థం దేశంలోని ఆరు పట్టణాల్లో స్మారక కేంద్రాలు నిర్మించారు. అందులో ఒకటి మన రైల్వేస్టేషన్ సమీపంలోని గాంధీహిల్. పర్వతం మీద 18 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1921లో నగరంలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సదస్సుకు మహాత్మాగాంధీ హాజరయ్యారు. ఆ సదస్సులో నగరవాసి పింగళి వెంకయ్య జాతీయ పతాక నమూనాను గాంధీకి చూపి ఆమోదం పొందారు. అటువంటి జాతీయోద్యమ ఘట్టాల సంభవించిన నగరంలో గాంధీ స్మారక ట్రస్ట్ స్మారక కేంద్రాన్ని ఇక్కడ నిర్మించింది. 1968లో అక్టోబర్ ఆరో తేదీన అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దీన్ని ఆవిష్కరించారు. 52 అడుగుల ఎత్తైన ఆ స్థూపాన్ని గుంటూరు జిల్లా రెంటచింతల నుంచి తెప్పించిన రెడ్‌మార్బుల్ స్టోన్‌తో నిర్మించారు. 1968లో పర్వతంపై గాంధీ స్మారక హాల్‌ను ప్రారంభించి అక్కడ గాంధీ జీవితానికి సంబంధించిన సాహిత్యాన్ని నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాకుండా మహాత్మాగాంధీ జీవిత విశేషాలను సందేశంగా వినింపించాలనే ఉద్దేశంతో పర్వతంపైన ధ్వని ప్రకాశ దర్శనం ఏర్పాటు చేశారు. దీనిని 1969లో ప్రారంభించారు. ఇది ప్రస్తుతం వినియోగంలో లేదు.

నక్షత్ర ప్రదర్శన శాల

ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కేఎల్ రావు కృషి ఫలితంగా నక్షత్రశాలను 1971 జూన్ 19న ప్రారంభించారు. రాష్ట్రంలో తొలిగా ఏర్పాటు చేసిన నక్షత్ర ప్రదర్శన శాల ఇదే. అనంతరం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇటువంటి ప్రదర్శనశాలలు ఏర్పాటయ్యాయి.



గాంధీహిల్‌పై స్థూపం

రీ సర్వే చేయండి

- ఏకలవ్యనగర్‌లో 600 మందికి అందని పరిహారం
- ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ మాజీ డైరెక్టర్ ఎంఆర్‌కే



ఎంఆర్‌కేతో మాట్లాడుతున్న బాధితులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారాన్ని అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా ఏకలవ్యనగర్‌లో సుమారు 600 మందికి వారి ఖాతాలో డబ్బు జమ కాలేదని ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ మాజీ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ(ఎంఆర్‌కే) పేర్కొన్నారు. మునిగిపోయిన ఇళ్ల సర్వే విషయంలో స్థానికేతర ఉద్యోగులు చేసిన అవకతవకల కారణంగానే అనేక మంది బాధితులకు అన్యాయం జరిగిందని, తక్షణమే ఇక్కడ రీ సర్వే చేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తమ ఖాతాలో డబ్బు పడుతుందని ఇప్పటి వరకు ఎదురుచూసిన 45వ డివిజన్ పరిధిలోని ఏకలవ్యనగర్ బాధితులు మంగళవారం రామకృష్ణ వద్దకు వచ్చి ప్రభుత్వం బాధితుల ఖాతాల్లో డబ్బు వేస్తున్న తరుణంలో తమకు ఇంకా రాకపోడంతో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు.

వాస్తవాలను తెలుసుకోకుండా అధికారులు ఇష్టారాజ్యంగా రాయడంతో అన్యాయం జరిగిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఏకలవ్యనగర్‌లో 90 శాతం మంది ఖాతాల్లో నష్టపరిహారం డబ్బు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం అందించడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

న్యాయం జరగడానికి కృషి చేస్తా

న్యాయం చేయాలని తన వద్దకు వచ్చిన ముంపు బాధితుల పేర్లు, ఫోన్ నంబర్లు తీసుకున్నామని, సమస్యను కలెక్టర్ సృజన దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మార్కే బాధితులకు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కావాటి కృష్ణ, స్థానిక నేతలు దశరథ, దాసరి తిరుపతయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నాస్తిక కేంద్రంలో ఏర్పాటైన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ఆలోచన ఉన్న వ్యక్తికి జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యువతే భవిష్యత్తు దేశ నిర్మాతలని, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ సమరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న భారత దేశం సాకారం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మునిసిపల్ కార్పొరేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ- ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేశారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న చంద్రశేఖర్

అర్హులకు పింఛన్ మంజూరు చేయాలి

కార్పొరేటర్ సత్యబాబు

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తిచేసుకున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హత ఉన్న లబ్ధిదారులకు పెన్షన్ ఇవ్వడంలో విఫలమైందని ఆరోపించారు. కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నిరాశ ఎదురైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని, సదరం సర్టిఫికెట్లు ప్రతి నెల ఇచ్చే విధానం అమలు చేయాలని, ఒక నెలలో పెన్షన్ తీసుకోని వారిని రెండో నెలలో కలిపి ఇచ్చే విధానం అమలు చేయాలన్నారు. ఒక రేషన్ కార్డు ఒక పెన్షన్ విధానం రద్దు చేసి రేషన్ కార్డుల్లో ఎంత మంది ఉంటే వారందరికీ పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



50వ డివిజన్‌లో పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

బ్రాండ్ హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సాక్షి అమరావతి: నగరంలోని నోవాటెల్ వరుణ్ హోటల్‌లో బ్రాండ్ హైలైఫ్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. హైలైఫ్ ఎగ్జిబిషన్స్ ఎండీ, సీఈఓ అభి పి డొమినిక్ మాట్లాడుతూ.. అతి పెద్ద ఎగ్జిబిషన్లలో హైలైఫ్ ఒకటన్నారు. వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్ అవసరాలతో పాటుగా లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నామన్నారు. ఫ్యాషన్ డిజైనర్ల నుంచి తాజా కలెక్షన్స్, ఫ్యాషన్ లేబుల్స్ సేకరించామన్నారు. ఫ్యాషన్ షాపింగ్, ఎక్స్‌క్లూజివ్ వెడ్డింగ్ షాపింగ్, బ్రైడల్ ఫ్యాషన్లు, జ్యువెలరీ, ఫ్యాషన్ - లైఫ్ స్టైల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బుధవారం కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.



క్యూలో ఉన్న భక్తుల వద్దకే తాగునీటి సరఫరా

పటమట(విజయవాడతూర్పు): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 25 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూలైన్లో ఉన్న భక్తుల వద్దకే తాగునీటి పంపిణీ చేయాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం ఆయన వీఎంసీ శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు అవసరమైతే సిబ్బందిని పెంచి రెండు పాయింట్లు మధ్యలో ఉన్న భక్తులకు తాగునీటి లోపం లేకుండా వారి వద్దకే పంపిణీ చేయాలన్నారు. అలాగే అమ్మవారి భక్తులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల్లో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దసరా శరన్నవరాత్రుల్లో వచ్చే అమ్మవారి భక్తులకు అవసరమయ్యే తాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూమ్స్ ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ, మరుగుదొడ్ల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏపీ న్యాయవాదుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్

విజయవాడస్పోర్ట్స్: ఏపీ న్యాయవాదుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా విజయవాడకు చెందిన దూబ క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఏపీ అడ్వొకేట్స్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఇటీవల జరిగిన జట్టు ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రాంతికుమార్‌ను జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశామన్నారు. క్రాంతి సారథ్యంలోని జట్టు ఈ నెల ఆరు నుంచి 14వ తేదీ వరకు లక్నోలో జరిగే అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జట్టులో సతీష్, సురేష్‌కుమార్, చంద్రశేఖరరెడ్డి, అశోక్‌కుమార్, నవీన్, మద్దేస్, లక్ష్మీకాంత్, దేవానంద్, సుబ్రహ్మణ్యం, ముజీబ్, శ్రీకృష్ణ, విజయ్‌నాయుడు, వెంకటేష్, నిఖిల్‌కుమార్, జయప్రకాష్ చోటు దక్కించుకున్నారు.

రేపటి నుంచి శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తొమ్మండ్రు శేషయ్య తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈ నెల మూడు నుంచి 12వ తేదీ వరకూ శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్ చెప్పారు. ఈ సందర్భంగా కేబీఎన్ కళాశాల కమిటీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం వేదికగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చండీ సప్తశతి హోమంతో పాటుగా అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూల మంత్ర సంపుటితో చేయడం యాగం ప్రత్యేకత అన్నారు. కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ చండీహోమంతో పాటు నిత్యం రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మి, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు, కుంకుమార్చన జరుగుతాయన్నారు. తొమ్మిదో తేదీన విద్యార్థులతో మహాసరస్వతి పూజను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారం ఉంటుందని పేర్కొన్నారు. వేదపఠనం, స్వామి వారి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విజయదశమి రోజున పూర్ణాహుతితో ఉత్సవాల పరిసమాప్తమవుతాయన్నారు. కోశాధికారి హరగోపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మేధోవికాసం జరగాలని కోరుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు దుగ్గి రామకిషోర్, వైస్‌ప్రిన్సిపాల్ కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పున్నమి ఘాట్ వద్ద స్వచ్ఛతాహిసేవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని ఆరవ ఆంధ్ర ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ నిర్వహించారు. మంగళవారం భవానీపురంలోని పున్నమిఘాట్ వద్ద 50 మంది ఎన్‌సీసీ కేడెట్లు పొడి చెత్త, తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా 8 ఆంధ్ర నావెల్ యూనిట్ కెప్టెన్ ప్రదీప్ మాట్లాడుతూ నదీ జలాల పరిశుభ్రత, ఈ–వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయడం, ద్వారా పర్యావరణ హిత వస్తువులను తయారు చేయవచ్చని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామని, పరసరాలను పరిశుభ్రం చేయడంలో స్వచ్ఛతాహీ సేవా ద్వారా ప్రజలను చైతన్యవంతులం చేస్తామని ఎన్‌సీసీ కేడెట్లతో ప్రతిజ్ఞ చేయించారు.



పున్నమి ఘాట్‌లో చెత్తను సేకరించి పరిశుభ్రం చేసిన ఎన్‌సీసీ కేడెట్లు

కార్యక్రమంలో ఎన్‌సీసీ 8 ఆంధ్ర నావెల్ అధికారులు వివేక్ తివారి, సునీల్ రాణా, స్టెల్లా, పీబీ సిద్ధార్థ, లయోలా కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడ తూర్పు): మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ డాక్టర్ సజ్జా రత్న కుమార్ తెలిపారు. జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల నృత్య సందడి





జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జిల్లా యువజనోత్సవాలు జరిగాయి. సబ్‌కలెక్టర్ చైతన్య ఉత్సవాలు ప్రారంభించారు. వేదికపై జానపద నృత్యాలతో యువతీ యువకులు సందడి చేశారు. విద్యార్థులు జానపద నృత్యాలతో అలరించారు. దసరా సందర్భంగా దుర్గమ్మను కీర్తిస్తూ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ